# నేపథ్యం

● కాలువ మల్లయ్య ●

**"ముత్తైమంతా పసుపు ముఖమెంతో ఛాయా
ముత్తైదు కుంకుమా బ్రతుకంత ఛాయా....
ముద్దు మురిపాలొలుకు ముంగిళ్ళలోనా....**

బీరకాయ పొట్టు గీకుతూ కూనిరాగాలు తీస్తోంది లలిత.

"ఏం వదినె... నీ అండ్ల నువ్వే పాడుకుంటున్నవు...? కొంచెమంత గట్టిగా పాడితే అరిగి పోతావా? మేం గూడ వింటమేంది? పాటలొచ్చి నోల్లు పైకి పాడకుంటె శాపం తలుగుతది... ఎరికేనా...?" అంటూ లలిత దగ్గరికొచ్చింది వరలక్ష్మి. ఆమెతో పాటు రాజమ్మ కూడా డైనింగ్ హోల్లో కొచ్చింది.

"నాకేం పాటలొస్తాయా? తోచక అలా కూని రాగాలు తీస్తున్నా. మీ అన్నయ్య డ్యూటీ కెళ్ళాడు. సెలవులు కదా! పిల్లలు బయటాడుకుంటున్నారు. వంటింకా పూర్తి కాలేదు. రండి. వచ్చిలా కూర్చోండి" అంది బీరకాయలు తరుగుతూ లలిత.

"ఇంకా వంటపని కాలేదా? అంతగనం ఏం వండుతున్నవు? నా పనైపోయి గంటైంది. భలె వంట జేస్తున్నవు వదిన?" నవ్వుతూ అంది రాజమ్మ.

"అన్నం వండాను. సాంబారు మసిలింది. గోంగూర పచ్చడి చేసాను. ఈ ఒక్క బీరకాయ పోప్ వేస్తే అయిపోయినట్టే అలా కూర్చోండి" అంది లలిత.

"రోజూ మీకు సాంబారుండాలె. వారానికోసారైనా గోంగూర పచ్చడి వేసుకుంటరనుకుంట" అంది లలిత ప్రక్కన నేలపై కూర్చుంటూ వరలక్ష్మి ఆమె ప్రక్కనే రాజమ్మ కూర్చుంది.

"ఇక్కడ కిందెందుకు కూర్చుంటారు వదినా? ముందు గదిలో సోఫాలో కూర్చోండి. ఐదు నిమిషాల్లో ఇది పోప్ వేసి వస్తాను. ఎంతైనా గోంగూర ఆంధ్రుల అభిమాన పచ్చడి గదా! అలాగే ఆవకాయ కూడా" అంటూ లేచింది లలిత.

"మీకైతే కావచ్చు కాని మా తెలంగాణోల్లకు కాదు. మేం గూడ వాడుతాం కాని అంతెక్కువ వాడం" అంది రాజమ్మ.

"మాకు పచ్చి పులుసు వాడకమెక్కువ" అంది వరలక్ష్మి.

"ఎవ్వరి అలవాట్లు వాళ్ళవిలే! మీరు సంక్రాంతి పండుగకు గంపలకొద్ది చకినాలు చేసుకుంటారు. మాకు సంక్రాంతి పెద్ద పండుగే అయినా చకినాల వాడకం మా దిక్కు తక్కువే" అంది వంటింట్లో కెళ్ళుతూ లలిత.

ఆమెతోపాటు వరలక్ష్మి రాజమ్మ కూడా వంటింట్లోకెళ్ళారు. బీరకాయ ముక్కలు పోప్ వేస్తుంది లలిత. ముగ్గురూ వంటల గూర్చి మాట్లాడుకుంటున్నారు.

"ఏంటి? వంటింట్లోనే నిల్చుని బాతాఖానీలో పడ్డారు. ఏం స్పెషల్ చేస్తున్నావు వదినా?" అంటూ వచ్చింది సుబ్బలక్ష్మి.

"నువ్వు తింటానంటే ఏదైనా చేసి పెడతాను. చికెన్, మటన్, ఎగ్, ఫిష్, ఏదైనా సరే" నవ్వుతూ అంది లలిత బీరకాయ ముక్కలు నూనెలో కలుపుతూ.

"భలే దానివున్నావు వదినా! ఎలాగూ నేను నాన్ వెజిటేరియన్ తిననని అవే చేసిపెడ్తానంటున్నావు. అంతగా వాటితోనే నీకు విందు చేయాలనిపిస్తే ఇదుగో వరలక్ష్మి, రాజమ్మ వదినమ్మలిక్కడున్నారు. వాళ్ళకు చేసిపెట్టు. సరేనా?" అంది సుబ్బలక్ష్మి.

"మేం తినటానికి రడీ. అయినా వదినమ్మకు గంత ధైర్యముందా? సైప పోతె పాపం బోతది. ఒక్కొక్క సైప కొంగుల ముడేస్తుంటది" అంది వరలక్ష్మి.

"అవును. నువ్వే పెద్దదానివి. నోట్లో వేలుపెడితే చీకవు. వెన్నబెడితే నాకవు. డబ్బులు పారేసి రాళ్ళు ముడేసుకుంటావు. కదా వదినా?" అంది నవ్వుతూ లలిత.

●●●

**చాలీ చాలని జీతానికి తోడుగా వుంటుందని ఇలా ఇంట్లో చీరలమ్ముతున్నాను**

●●●

## మధ్య తరగతి వాళ్ళ విషయంలోనే ఈ బేధాలెక్కువగా వుంటాయి

"ఎంతైనా మీకంటె ఎడ్డోలమే మేం. అయితే మాయెగని ఇంట్లో ఇడ్లీ వాసనవస్తుంది. ఇడ్లీ వేసి నవా? అయినా రెండ్రోజులకోసారి మీ ఇంట్లో ఇడ్లీయే టిఫెన్ గదా!" అంది రాజమ్మ.

"నిన్న ఇడ్లీ వేసాను. అదే పిండి మిగిల్తే ఈ రోజు దోస వేసిచ్చాను. మీకు టిఫెన్ పెట్టను కాని మీరు ముందు రూంలో కూర్చుంటే ఐదు నిమిషాల్లో కమ్మని కాఫీ — ఇంచుమించు ఫిల్టర్ కాఫీ రుచికి సరిపోయేది తాగిస్తాను. మీరెలాగూ మా ఫ్రాకే కదా!" అంది ముందు రూంలోకి నడుస్తూ లలిత.

ఆమె వెనుకే వాళ్ళంతా నడిచారు.

"అమ్మబాబోయ్ . ఇప్పుడు మేం కాఫీ తాగం. కాఫీ తాగుతే దీని ధర కూడా మేము కొనబోయే చీరల ధరల్లో వసూల చేస్తావు. పెద్ద పెద్ద బట్టల దుకాణాల్లో కెళ్ళితే కళ్ళు జిగేలుమనేట్టు లైట్లువేసి కూల్ డ్రింకులు, కాఫీ లిచ్చేదెందుకు? మనల్ని బుట్టలో వేసుకునేందుకు. తర్వాత వడ్డీతో సహా ఈ ఖర్చులన్నీ మనం కొనే వాట్లోనే కలిపి మనకు తెలియకుండానే వసూలు వేస్తారు" అంది సుబ్బలక్ష్మి సోఫాలో కూర్చుంటూ.

వరలక్ష్మి, రాజమ్మ కుర్చీల్లో కూర్చున్నారు.

"నేవలాంటి దాన్ని కాదులే. ఏదో నేన్నీళ్ళకు చన్నీళ్ళలా వాళ్ళ వాలని జీతానికి తోడుగా వుంటుం



కథ

# 'మిథున్' మాల వేసుకున్నాడు



**అ**య్యప్ప మాల మహత్యం అంతా ఇంతా కాదు. ఆ మాల ధరించి ఎందరో నటులు వెలుగులోకి వచ్చారు. ప్రస్తుతం 'మిథున్ చక్రవర్తి' కూడా ఆ మాల ధరించి 40 రోజుల వ్రతం ఆచరిస్తున్నాడు. అతని చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి కనుక ఇక మంచి అతనికి మంచి భవిష్యత్తు దొరుకుతుందని ఆశిద్దాం!

దని ఇలా ఇంట్లో చీరలమ్ముతున్నాను. విజయవాడ కెళ్ళినప్పుడు తీసుకొస్తుంటాను. మీరు మాట్లాడుతూ ఉండండి. ఇప్పుడే వస్తాను" అని వంటింట్లోకెళ్ళింది లలిత. కొద్ది సేపట్లో ట్రేలో కాఫీకప్పులు పెట్టుకొని ముందు గదిలోకొచ్చింది. ముగ్గురికి కాఫీలిచ్చి తానూ ఒకటి తీసుకుంది.

కాఫీ తాగుతూ మాటల్లో పడ్డారు వాళ్ళు.

"కాఫీ చాలా మంచిగుంది. ఇదేం కాఫీ వదినా?" అంది వరలక్ష్మి.

"ఇది దుకాణాల్లో దొరికేది కాదు. మద్రాసు నుంచి తెప్పించిన కాఫీ పొడి ఇది. స్పెషల్ కాఫీ" ఊరిస్తూ అంది లలిత.

ఖాళీ కప్పులను తీసుకెళ్ళి వంటింట్లో పెట్టి, కూరగిన్నె దించి స్టౌ ఆర్పేసి వచ్చి ముందు గదిలో కూర్చుంది లలిత.

"ఇక చెప్పండి. ఏం కావాలో?" అంది.

"నీకు తెలువదా వదినె? పండుగ ముందు మీ ఇంటికెవ్వరైన ఎందుకొస్తరు? పండుగకు కొత్త బట్టలేమన్న తీసుకొచ్చినవేమో చూపెట్టు" అంది రాజమ్మ.

"మీ కండ్లు జిగేలు మనిపించేట్టున్నాయి బట్టలు. చూస్తే వదలపెట్టరు. మొన్ననే మా మరిదితో తెప్పించాను. చూస్తారా?" అంది లలిత.

"వచ్చిందే అందుకోసం కదా! చూపెట్టు" అంది సుబ్బలక్ష్మి

బెడ్‌రూంలోకెళ్ళి బీరువాలోంచి కొన్ని చీరలు తీసుకొచ్చి వాళ్ళముందేసింది లలిత. మనిషికో చీర చేతిలోకి తీసుకొని చూస్తున్నారు. కొద్దిసేపాగి ఒకరి చేతిలోంచి మరొకరి చేతిలోకి మార్చుకున్నారు. తెచ్చిన చీరలన్నిటినీ శల్య పరీక్ష చేసారు. అరగంట సేపు చూసి ముగ్గురు మూడు చీరలు సెలెక్టు చేసుకున్నారు.

వాటి ధరలడిగారు. చెప్పింది లలిత.

అందులో ఏ చీర ధరా ఐదువందలకంటె తక్కువ లేదు.

"చీరలు మంచిగానే ఉన్నాయి. కాని ధర బాగా చెప్పుతున్నవు వదినా?" అంది వరలక్ష్మి.

"చీరల క్వాలిటీని బట్టే ధరలుంటాయి. షాపుకెళ్ళితే వీటికే మరో రెండువందలెక్కువ ధర పెడతారు మీరే" అంది లలిత.

"అంత ఎడ్డోల్లప్పుడెవ్వలు లేరు. ధరలు తెలువయనుకోకు. ఎంతైన మీరు చాలుగాల్లే వదిన కోస్తా ఆడోల్లని చూస్తె గమ్మతనిపిస్తది. అందరిని కాదు కాని మీదాంట్ల చాలా మంది ఎంతో కొంత పంపాయించాలని చూస్తరు. మీ ఖర్చుల మందం మీరన్న ఎల్లదీసుకుంటరు" అంది రాజమ్మ.

"అందులో తప్పేముంది? ఈ రోజుల్లో ఒక్కరి సంపాదనతో బ్రతకడం సాధ్యమవుతుందా?" అంది సుబ్బలక్ష్మి.

"అవును. తప్పని నేనంటలేను. కాని గివన్ని మాకు చాతగావు. గా రత్నమ్మ వదిన గాజుల వ్యాపారం చేస్తుందా? ఈ వదిన బట్టలమ్ముతుందా? చాముండేశ్వరి బేబీ కేర్ సెంటర్ పెట్టిందా? ఇట్లా ఏదో పని చేస్తుంటరు మీరు. మీకు సంపాదన ముఖ్యం" అంది రాజమ్మ.

"మీ వాళ్ళు భార్యలతో ఉద్యోగం చేయించడానికి కూడా వెనుకాడతారట కదా!" అంది లలిత.

"మా మొగోల్లకు రోషమెక్కువ. ఉపాసమున్నా మంచిదే గాని పెండ్లాలు ఉద్యోగాలు చేయొద్దనెటోల్లు. ఇప్పుడిప్పుడు మా ఆడవాళ్ళు కూడా నౌకర్లు చేస్తుండ్రు. ఎంతైన మీతోని పోలిస్తే తక్కువే" అంది వరలక్ష్మి.

"అవసరమే మనతో అన్ని పనులు చేయిస్తుంది" అంది లలిత.

"ఎంతైనా మీ అంత ఫాస్ట్ మేముండం" అంది రాజమ్మ.

"మీ మగాల్లు మిమ్మల్నలా ఉంచారు" అంది సుబ్బలక్ష్మి.

"కానమ్మ. కాని మొగోల్లతోని కలిసి పనిజేసుడంటె నాకైతే నచ్చది వదినా. నువ్వేమన్ననుకో అందుకే మా ఆయన నన్ను ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చెయ్యమని ఎంత చెప్పినా నేను వింటలేను. ఇప్పుడు చదివి నేనేం చెయ్యాలె? ఏమన్న నౌకరి చేసేదుందా?" అంది వరలక్ష్మి.

"ఇలాంటి ఆలోచనతోనే వెనుకబడిపోతారు. మీ వాళ్ళెంత మంది స్త్రీలు డిగ్రీలు చెయ్యడం లేదు? ఉద్యోగం చెయ్యమన్నా చదువుకున్న స్త్రీ ఇంట్లో పిల్లలకైనా ఉపయోగపడ్తుంది" అంది సుబ్బలక్ష్మి.

"అవును. నువ్వన్నది నిజమే. ఎంతైనా మీ దోపికే. ఇటు ఇన్ని దందాలు చేస్తూ అటు డిగ్రీ కూడా చేస్తున్నారు. నువ్వు కూడా ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ చేస్తున్నావట కద వదినా? అంది రాజమ్మ.

"అవును. ఇప్పుడు ఫైనలియర్" అంది సుబ్బలక్ష్మి.

"ముచ్చట సంబరాన దొంగతిండి మరిచినట్టు అసలు మనం వచ్చిన పనే మరిచిపోయినం. ఏం వదినా! ఈ చీరల ధరలు కొంత తగ్గించాలి" అంది వరలక్ష్మి.

బేరాలు జరిగాయి. ప్రతి చీరకూ పాతిక రూపాయలు తగ్గించింది లలిత. ఇక అంతకంటె తగ్గించటం తన నుంచి కాదంది. ఆ ధరల కొప్పుకోక తప్పలేదు వాళ్ళకు.

"ఇప్పుడు మనం మూడు చీరలు కొన్నామా? వీటి మీద నాలుగు వందలన్న సంపాయించింది వదినమ్మ" అంది రాజమ్మ.

ఆ మాటలు విని నవ్వింది లలిత.

"అలా అయితే ఇప్పటికే లక్షలు సంపాదించి వుండేదాన్ని. చీర మీద ఇరవై రూపాయల లాభముంటే ఎక్కువ" అంది.

"అబ్బో. నువ్వు గట్లనే అంటవు. ఇరవై రూపాయలకైతే గీ బేరమే చెయ్యవు" అంది వరలక్ష్మి.

"సీట్లోకి దిగితే కాని లోతు తెలియదు. మా వారు ఫిక్స్‌డు రేట్ల కమ్మమన్నారు. మీకు చాలా తగ్గించాను. వారికి తెలిస్తే కోప్పడతారు" అంది లలిత.

వరలక్ష్మి, రాజమ్మ ఆ మాటలకు కిసుక్కున నవ్వారు.

"ఎందుకు నవ్వుతున్నారు?" అడిగింది లలిత.

"మీ ఇండ్లలో చాలా వరకు ఆడవాళ్ళ పెత్తనమే ఉంటదట. మీరే సాగిచ్చుకుంటరట. మీ పేర్లమీదనే ఆస్తులుంటయట. నిజమేనా వదినా?" అంది వరలక్ష్మి.

"మొత్తం మీద అసాధ్యురాలివే. నవ్వుతూ నవ్వుతూనే చాలిలో తగిలేట్టు మాట్లాడావు. ఓ ప్రాంతం ప్రజల్లో ఇలా వుంటుందని కాదు. వ్యక్తులను బట్టి వుంటుంది. అయినా ఆడవాళ్ళ పెత్తనమంటే తప్పనా నీ ఉద్దేశ్యం? స్త్రీ బతుక్కి సెక్యూరిటీ కోసం వరకట్నం ఇచ్చేప్పుడు ఆస్తిని కూతురు పేరు మీద ఉంచుతారు. ఆస్తులు మా పేరు మీద ఉండడమంటే ఇలాగే తప్ప మా భర్తలేం రాయరు" అంది లలిత.

"మా మొగోల్లయితె అంత వాళ్ళ పేరుమీద్నే చెయ్యాలంటారు. మా పేరు మీద ఆస్తంటె బొండిగె పిసుకుతమంటారు" అంది రాజమ్మ.

"ఇప్పుడు మునుపటోలేం లేదు. అందరు జాగ్రత్త పడుతున్నారు. వరకట్నం డబ్బు బిడ్డ పేరు మీద ఫిక్సుడు చేస్తున్నారు" అంది వరలక్ష్మి.

"అవును. నిజమే" అంది సుబ్బలక్ష్మి.

"సరేకాని వరలక్ష్మి దసరా పండుగ ఇంకో వారంరోజులే ఉంది కదా! ఎప్పుడెళ్తున్నావు మీ పుట్టింటికి? ఈసారి వెళ్ళదలుచుకోలేదా ఏంటి?" అంది లలిత.

"బతుకమ్మ పండుగ మాకు చాలా పెద్ద పండుగ. పోకపోవుడనే సంగతే లేదు. ఎంత లేనోల్లైనగీ పండుగకు తల్లిదండ్రులు ఆడబిడ్డలను తోలుకపోతరు. అప్పుసప్పు చేసైన కొత్త చీర కొంటరు. మా బావన్న, మా తమ్ముడన్న తోలుకపోనొత్తరు. వాళ్ళొచ్చినంక పోత. ఇయ్యాల్లనో, రేపో తప్పకుంటొత్తరు" అంది వరలక్ష్మి.

ఆ మాటలకు సుబ్బలక్ష్మి లలిత పకపకా నవ్వసాగారు. వరలక్ష్మి ఆశ్చర్యంగా నోరెళ్ళబెట్టి చూస్తుంది. వాళ్ళలా నవ్వడానికి కారణం ఆమెకు బోధపడడంలేదు. రాజమ్మకూ వాళ్ళెందుకు నవ్వుతున్నారో అర్థం కావడం లేదు. వాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు కొద్దిక్షణాలాగి.

"ఏంది వదినా? ఏం కప్పింది? మీరెందుకు గంతగనం నవ్వుతండ్రు?" అంది వరలక్ష్మి.

●●●

**ఇటు ఇన్ని దండాలు చేస్తూ అటు డిగ్రీలు కూడా చేస్తున్నారు.**

●●●

"తోలుక పోవడానికి మీరేమన్న పశువులా? అంటే మీ మెడలలో పలుపులేసి తీసుకెళ్తారన్న మాట. అలా తోలుకెళ్ళకుంటే మీరు మీ పుట్టింటికెళ్ళరన్నమాట. అంతేనా?" అంది.

ఆ మాటలు విని ముఖం మాడ్చుకుంది వరలక్ష్మి.

"సారీ! వరలక్ష్మి! నీకు బాధ కల్గినట్టుంది. అలా హాస్యానికన్నాను. ఏమనుకోకు" అంది లలిత.

"మీకేంది వేలమైళ్ళ దూరమైన ఒంటరిగ పోతరు. వేరే రాష్ట్రాలకైన ఒక్కలే పోతరు. మాకట్ల పోవుడు చాతగాదు. మాకు మావోళ్ళంబడుండాలె" దెప్పినట్లుగా అంది వరలక్ష్మి.

వరలక్ష్మి మాటలను సమర్థించింది రాజమ్మ.

"ఇంకా కోపం పోనట్టుంది వరలక్ష్మికి. జోక్ కోసమన్నానని చెప్పాను కదా. మీలో చాలా మందికి బజారుకెళ్ళి కూరగాయలు తెచ్చుకోవడం కూడా అలావాట్లేదనుకుంటా" అంది లలిత.

"అవును. నేనింతవరకు మార్కెట్ కెళ్ళింది లేదు. ఇంటికొస్తె కూరగాయలు కొంట. లేకుంటె మావారే తెస్తరు" అంది సుబ్బలక్ష్మి.

ఆ మాటలకందరూ నవ్వారు.

వరలక్ష్మి, రాజమ్మ లేవబోతున్నారు.

"అదుగో. తిరుపతమ్మాయి వస్తుంది అలా కూర్చోండి" లలిత అనగానే వాళ్ళలాగే కూర్చున్నారు.

ఇంతలో నీరజ వచ్చి వాళ్ళ దగ్గర కూర్చుంది.

"మనం మనం తిట్టుకున్నం. దెప్పుకున్నం. మాట్లాడుకున్నం. మరి ఈ రాయలసీమవాళ్ళ సంగతేంటి?" అంది సుబ్బలక్ష్మి.

"ఏంటి? దేన్ని గురించి మీరు చర్చించుకుంది?" అంది నీరజ.

"చర్చలేదు. పాడులేదు. మాట తర్వాత మాట అలా సాగిపోతుంది. కోస్తా, తెలంగాణా ప్రాంత స్త్రీల్లో వుండే భేదాల గూర్చి మాట్లాడుకుంటున్నాం. మరి మీ సంగతేంటి?" అంది లలిత.

"ఏ ప్రాంతంలోనైనా మరీ లోయర్ క్లాస్, హైయ్యర్ క్లాస్ వాళ్ళ విషయంలో పెద్దగా భేదాలుండవు. మధ్యతరగతి వాళ్ళ విషయంలోనే ఈ భేదాలెక్కువగా వుంటాయి. రాయలసీమ స్త్రీ గొడ్డులా పనిచేస్తుంది. మాకు వ్యాపారదృక్పథం తక్కువ" అంది నీరజ.

"మొత్తం మీద మనం నవ్వుకుంట, నవ్వుకుంటనే చాలా విషయాలు మాట్లాడుకున్నాం" అంటూ లేచింది వరలక్ష్మి.

ఆమెతో పాటు రాజమ్మ, సుబ్బలక్ష్మి లేచారు.

"వరలక్ష్మి! మీ వారు రచయిత కదా! మనం మాట్లాడుకున్న విషయాలన్నీ చెప్పెయ్యి. మంచి కథ రాసేస్తాడు. ప్రైజు లాంటిదొస్తే మీ పండుగ ఖర్చంతా వెళ్ళిపోతుంది" అంది లలిత.

ఆ మాటలకంతా నవ్వారు.

"అయ్యో! నీకు తెలువదా వదినె? ఇటువంటి విషయాలు మావారితోనెన్నో సార్లు మాట్లాడిన. కాని, నాకాయన మాటలే సరిగ్గా అర్థం కావు. పైకి కనిపించే ప్రతిదాని వెనుకా ఎన్నో కారణాలుంటాయంటారాయన. అవి మనకు కనిపించక పోవచ్చట. రాయలసీమ స్త్రీ కష్టించి పనిచేసే మనస్తత్వానికి, తెలంగాణా స్త్రీ వెనుకబాటుతనానికి, కోస్తా వాళ్ళ వ్యాపారదృక్పథానికి రాజకీయ, సాంఘిక, ఆర్థిక... ఇంకేమో కారణాలున్నాయంటారాయన. గాపెద్ద విషయాల్ని మన కెందుకు? పోతా" అని అక్కన్నుంచి వెళ్ళిపోయింది వరలక్ష్మి.

ఆమె వెనుకే రాజమ్మ, సుబ్బలక్ష్మి వెళ్ళి పోయారు.

కొత్తగా వచ్చిన చీరలు చూపెట్టడానికి నీరజను ఇంట్లోకి తీసుకెళ్ళింది లలిత.

●